ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 22 ఏప్రిల్ 2025

పాలిటెక్నిక్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి




మాట్లాడుతున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సింగరేణి పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులెవరైనా పాలిటెక్నిక్ చేస్తే డిప్లమో చేసి ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశాలు ఉంటాయన్నారు. పాలిటెక్నిక్, డిప్లమో పూర్తి చేసిన సుమారు 18 మంది మహిళలు కేటీకే 5వ గనిలో సూపర్‌వైజర్లుగా, అధికారులుగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ప్రధానోపాధ్యాయురాలు సి.హెచ్. ఝాన్సీ పాల్గొన్నారు.

ఒకరికి ఏడాది జైలు శిక్ష

వాజేడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): యాక్సిడెంట్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష పడింది. వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం వివరాలు వివరించారు. 2018లో పెద్దగొల్లగూడెం గ్రామానికి ఏటూరునాగారం మండలం శివాపురం నుంచి కూలీలను తీసుకెళ్తున్న వాహనం మండలంలోని మండపాక వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతిచెందారు. ఈ ప్రమాదంపై అప్పటి సీఐ రవీందర్, ఎస్సై కృష్ణప్రసాద్ వాజేడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన కోమేర బాబురావుకు ములుగు జిల్లా కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. పీపీ శ్యాంప్రసాద్ కోర్టు ముందు సాక్ష్యులను ప్రవేశపెట్టగా సీడీవో జి.నాగరాజు ప్రాసిక్యూషన్‌కు సహకరించినట్లు ఎస్సై తెలిపారు.

బహుదూర విద్య



- డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు గ్రహణం
- అందుబాటులో లేని ఓపెన్ వర్సిటీ సెంటర్
- ఉన్న కేంద్రం కూడా భూపాలపల్లికి తరలింపు
- పెరిగిన దూరా భారం.. ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు



మహదేవపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాలతో అర్ధంతరంగా చదువును మానేసి వారికి అద్భుత అవకాశం దూర విద్యా విధానం. ఏం చదువుకోపోయినా దీని ద్వారా ఉన్నత విద్య వైపు పయనించొచ్చు. డిగ్రీ పట్టాతో ముందుకు వెళ్లొచ్చు. మంచి ఉద్యోగావకాశాన్ని కూడా పొందొచ్చు. ఈ విద్యా విధానం దశాబ్దాల కాలంగా కొనసాగుతోంది. దీన్ని పలు విశ్వవిద్యాలయాలు ప్రవేశపెట్టి చదువు మానేసి ప్రోత్సహిస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈదూరవిద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే.. భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, కాటారం, మల్హర్ మండలాల్లో ఇది కుంటుపడిపోయింది. ఈఐదు మండలాల్లో స్టడీ సెంటర్లు లేక చాలా మంది అవస్థలు పడుతున్నారు.

భూపాలపల్లికి వెళ్లాల్సిందే..

ఐదు మండలాలను కలుపుకొని మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గతంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఉండేది. అయితే.. అడ్మిషన్ల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో 2022లో దీని తొలగించారు. అప్పటికే అక్కడ విద్యనభ్యసిస్తున్న వారిని భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న కేంద్రానికి తరలించారు. దీంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ కేంద్రం తొలగించే నాటికి 220 పైచిలుకు అభ్యర్థు లు దూరవిద్యవిధానంలో చదువు తుండగా ఒక సబ్జెక్టు ఆగినా భూపాలపల్లికి వెళ్లనిదే సమాచారం అందడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు సైతం అక్కడికి వెళ్లే రాయాల్సి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందని చెబుతున్నారు. మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు పలిమెల, కాటారం, మల్హర్, మహాముత్తారం మండల కేంద్రాల నుంచి భూపాలపల్లికి సుమారు 50కిలో మీటర్ల దూరం ఉందని, పరీక్ష ఫీజు, పరీక్షల సమాచారం, మరే ఇతర సమాచారం తెలుసుకోవాలన్నా భూపాలపల్లికి వెళ్ల తప్పడం లేదని పలువురు ఓపెన్ డిగ్రీ అభ్యర్థులు వాపోతున్నారు.

మారుమూల మండలాల్లో అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం కృషిచేయాలని, మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న సెంటర్‌ను మళ్లీ ప్రారంభించాలని ఐదు మండలాల ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలోనే భూపాలపల్లి జిల్లా అక్షరాస్యతలో వెనుకబడిందని, ఉన్న కేంద్రాలను తొలగిస్తూ పోతే అక్షరా స్యత పెరిగే అవకాశం ఎలా ఉంటుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఓపెన్, టెన్త్ ఇంటర్‌లో భారీగా అడ్మిషన్లు

మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌కు ప్రతి సంవత్సరం రెండింట్లలో కలిపి సుమారు 120 పైచిలుకు డ్రాప్‌అవుట్లు అడ్మిషన్ పొందుతున్నారు. వీరిలో రెగ్యులర్ కోర్సుల వైపు మొగ్గుచూపే వారి సంఖ్య తక్కువే. చాలా మంది ఇంటి దగ్గరే ఉంటున్నారు. అదే ఓపెన్ డిగ్రీ చేసేందుకు అవకాశం ఉంటే వీరంతా అడ్మిషన్ పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా దూరవిద్యలో ఓపెన్ డిగ్రీ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తే అడ్మిషన్లు క్రమంగా పెరిగే అవకాశం కూడా ఉంది. అయినప్పటికీ అధికారులు దీనిపై దృష్టిసారించకపోతుండటంతో ఈప్రాంతంలో విద్యనభ్యసిస్తున్న చాలా మంది విద్యార్థుల టెన్త్, ఇంటర్ వరకే పరిమితమవుతున్న పరిస్థితి ఎదురవుతోంది. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికకు దూరవిద్యలో డిగ్రీ చేసినవారికి అవకాశం కల్పిస్తుండటంతో గతంలో టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన వారు సైతం ఓపెన్ డిగ్రీలో జాయిన్ అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించి ఐదు మండలాలను కలుపుకొని మహదేవపూర్‌లో మళ్లీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. అటవీ మండలాల్లో అక్షరాస్యత పెరగాలంటే దూరవిద్య కేంద్రాలు అందుబాటులో ఉండాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్

ఘనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు



ఒసాకా ఎక్స్‌పోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల

మహదేవపూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : జపాన్‌లోని ఒసాకాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక ఎక్స్‌పోలో తెలంగాణ తన ప్రత్యేకతమైన పెవిలియన్‌ను ఘనంగా ప్రారంభించింది. కిటాక్యూషు నుంచి ఒసాకా చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం భారత పెవిలియన్‌లో అడుగు పెట్టింది. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జోన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒసాకో ఎక్స్‌పో నిర్వహిస్తారు. ఒసాకో ఎక్స్‌పోలో పాల్గొన్న మన దేశంలోని తొలి రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం. ఈ వేదిక ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోంది.

ఎమ్మెల్సీ కవితకు ఘన సన్మానం


చల్వాయిలో ఎదురేగి స్వాగతం పలికిన నాయకులు, మహిళలు



చల్వాయిలో కవితకు స్వాగతం పలుకుతున్న నాయకులు, మహిళలు

గోవిందరావుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఘన సన్మానం జరిగింది. సోమవారం ఆమె భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ములుగుకు వస్తూ మండలంలోని చల్వాయి గ్రామంలో తన కాన్వాయ్‌ని ఆపి పార్టీ కార్యకర్తలను పలకరించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, మహిళలు ఎదురేగి ఆమెను మంగళహారతులతో స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అనంతరం నాయకులు జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్, నాయకులు తుమ్మల హరిబాబు, భూరెడ్డి మధు, నాం పూర్ణచందర్, ఆలూరి శ్రీను, బొల్లం ప్రసాద్, మోహన్‌రాథోడ్, బొడిగె రఘు, రాజు, సాంబశివరావు, ఊట్ల మోహన్, మహిళలు పాల్గొన్నారు.

నేడు ఎల్కతుర్తికి కేటీఆర్ రాక



ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను పరిశీలించేందుకు గాను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి రానున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో రానున్న ఆయన సభా ప్రాంగణం, వేదిక తదితర ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అనంతరం బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశమవుతారని, సభ నిర్వహణ, ప్రజల రవాణా సౌకర్యాలపై దిశానిర్దేశం చేస్తారని తెలుస్తోంది.

రవళికను పరామర్శించిన సీతక్క

అండగా ఉంటామని భరోసా ఇచ్చిన మంత్రి



హనుమకొండలోని హస్పిటల్‌లో రవళికను పరామరిస్తున్న మంత్రి

ములుగు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ములుగు ఏరియా ఆస్పత్రిలో డెలవరీ అనంతరం బిడ్డను కోల్పోయిన బండారుపల్లి గ్రామానికి చెందిన రవళికను రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం పరామర్శించారు. హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంత్రి సీతక్క ఆమెను కలిశారు. రవళికను పరామర్శించి ఆమె ఆరోగ్య స్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధానాలుగా అండగా ఉంటుందని రవళికకు సీతక్క ధైర్యం చెప్పారు. చికిత్స ఖర్చునంతా ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

ములుగు ఏరియా ఆస్పత్రిలో ఈనెల 18న రవళిక ప్రసవించింది. పాపకు జన్మనిచ్చిన అనంతరం తల్లీబిడ్డలు ఇద్దరూ అవస్థతకు గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్తున్న క్రమంలోనే పసికందు మృతి చెందింది. నార్మల్ డెలివరీ చేస్తామని వైద్యులు ఆలస్యం చేయడం వల్లే శిశువు చనిపోయిందని, తల్లి రవళిక కూడా తీవ్రంగా అస్వస్థతకు గురైందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు ములుగు ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. అదే క్రమంలో వెంకటాపూర్ పర్యటనకు వచ్చిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ కాన్వాయ్ జాతీయ రహదారిపై అటువైపు వెళ్లగా రవళిక కుటుంబ సభ్యులు వారి ఎదుట పసికందు మృతదేహంతో నిరసన తెలిపారు. దీనిపై మంత్రి సీతక్క స్పందిస్తూ ఈ ఘటనపై విచారణ చేపడతామని, బాధిత మహిళకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో రవళికను ఆమె సోమవారం వరంగల్ ప్రైవేటు ఆస్పత్రిలో పరామర్శించారు.

ధరణి పేరుతో దగా చేసిన బీఆర్ఎస్

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణితో రైతులను దగా చేసిందని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన భూభారతిలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకతను పాటిస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంపై భూపాలపల్లి మంజూర్‌నగర్‌లోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం జరిగిన అవగాహన సదస్సుకు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన హాజరయ్యారు. భూభారతి చట్టంలోని అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూములకు అన్ని హక్కులు కల్పించే విధంగా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి వల్ల పట్టాలు కాక అనేక మంది ప్రజలు అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. పేదల కడుపుకొట్టి పెద్దలు కడుపులు నింపుకున్నారని ఆరోపించారు.

తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో వేసి బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల్లో మాటిచ్చామని, దాని ప్రకారం రైతులకు ఒక ఆదర్శవంతఎ చట్టాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని తొమ్మిది మంది సీనియర్ అధికారులతో కమిటీ వేసి భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ప్రజలకు న్యాయం చేసేలా రూపొందించామని తెలిపారు. 30 రోజుల్లో భూ సమస్యలు తహసీల్దార్ పరిష్కరించే విధంగా చట్టం తీసుకొచ్చామని, 30 రోజుల్లో తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయకపోతే ఆటోమేటిక్‌గా భూభారతిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు. ఏ స్థాయిలో ఉన్న అధికారిపైనైనా వారి పైఅధికారికి ఫిర్యాదు చేసే అవకాశాన్ని ఈ చట్టంలో తీసుకొచ్చినట్లు తెలిపారు.

కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి భూమికీ భూధార్‌కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. 12 నుంచి సాగులో ఉంటే విచారణ జరిపి పట్టా ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు ఒక ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 1989లో ఆర్‌వోఆర్ చట్టానికి అప్పటి ప్రభుత్వం నిబంధలు రూపొందించారని, 2020లో తీసుకొచ్చిన ధరణి చట్టానికి ఎలాంటి రూల్స్ లేవన్నారు. ప్రస్తుతం 2025లో వచ్చిన భూభారతి చట్టంలో స్పష్టమైన నిబంధనలను రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రవి, తహసీల్దార్ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ మేకల సంపత్ యాదవ్, ఆర్టీఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

పుష్కరాల పనులు పూర్తి చేయాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల పనులను పకడ్బందీ ప్రణాళికతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం పనులు చేపట్టి సకాలంలో అందుబాటులోకి తేవాలన్నారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ శాఖ, ఆర్టీసీ అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. పుష్కరాల పనుల పురోగతిపై సమీక్షించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పుష్కర ఏర్పాట్లు విజయవంతం చేయాలన్నారు. గోదావరి నదిలో నీటి సామర్థ్యాన్ని నిశితంగా గమనిస్తూ ఉండాలన్నారు. గడిచిన 21 రోజుల నుంచి గోదావరి నీటి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 13 సెంటీమీటర్ల మేర నీరు తగ్గినట్లు తెలిపారు. గత మే నెలలో గోదావరి నీటిమట్టం 94 మీటర్ల 540 సెంటీమీటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీపీవో నారాయణరావు, డీఎంహెచ్‌వో మధుసూదన్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హార్‌నాయక్, పీఆర్ఈఈ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినతుల స్వీకరణ

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజావాణిలో 52 వినతులు వచ్చాయి. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో మంటలు

గోవిందరావుపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని దయ్యాలవాగు వద్దగల డంపింగ్‌యార్డులో సోమవారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొద్దినెలలుగా గోవిందరావుపేట గ్రామ పంచాయతీలో సేకరించిన చెత్తను దయ్యాలవాగు ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు మంట పెట్టడంతో పెద్దఎత్తున మంట, పొగ వ్యాపించాయి. పస్రా పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న ములుగులోని అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

బీజేపీది గాడ్సే సిద్ధాంతం

- అదానీ, అంబానీలకు రూ.21 లక్షల కోట్లను మాఫీ చేశారు
- రైతులకు రుణమాఫీ చేయడానికి చేతులు రాలేదు
- స్వేచ్ఛ, సమానత్వాల పరిరక్షణకు రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి
- ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపులో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

7

వడదెబ్బతో రైతు మృతి



ప్రభాకర్ (ఫైల్)

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వడదె బ్బ తో రైతు మృతిచెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో ఆదివారం రాత్రి చోటుచే సుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం.. ఇప్పలపల్లి గ్రామానికి చెందిన దూడపాక ప్రభా కర్(48) టైలరింగ్ చేస్తుంటాడు. తనకున్న 20 గుంటలు భూమిలో వ్యవసాయం కూడా చేస్తూ కుటుం బ్ని పోషించుకుంటున్నాడు. వరిపంట కోతకు రావ డంతో ఆదివారం పొలం వద్దకు వెళ్లాడు. ఎండలోనే వరి కోశాడు. తీవ్రంగా ఎండ ఉండటంతో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంటకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు కేతిపల్లి తిరుపతిరెడ్డి, రెంటాల సంపత్, కార్యకర్తలు పరామర్శించి మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



ఐటీడీఏలో గిరిజన దర్బార్‌లో పీవోకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల వద్ద నుంచి పీవో వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో 15 మంది గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా లోన్ ఇప్పించాలని మంగపేట మండలం కొత్తపల్లికి చెందిన స్వరూప వినతిపత్రం అందించారు. జీవనోపాధి కోసం ఐటీడీఏ ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని ఏటూరునాగారం మండలం ఆకులవారిఘణపురం గ్రామానికి చెందిన కేంసర్తి అరుణ వేడుకున్నారు. అటవీ శాఖ స్వాధీనం చేసుకున్న భూములను తమకు ఇప్పించాలని మంగపేట మండలం బాలన్నగూడానికి చెందిన రైతులు లక్ష్మయ్య పాటు 14 మంది విన్నవించారు. మహబూబాబాద్ మండలం రెడ్యాలా గ్రామ సమీపంలోని కమ్యూనిటీ హాల్‌కు రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాములు, కృష్ణయ్య వినతి పత్రం అందించారు. తాడ్వాయి మండల కేంద్రంలో గల ఎంపీపీఎస్ పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, డీడీ పోచం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఆగం చేస్తే కేసీఆర్ ఊరుకోరు

- కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ పాలన
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభా స్థలం పరిశీలన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు ఆగం చేస్తుంటే.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చూస్తూ ఊరుకోరని, ఆయన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ నెల 27న సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్ కుమార్, సభ ఇన్‌చార్జ్ బాలమల్లుతో కలిసి సోమవారం పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 25 వసంతాల గులాబీ సభ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు సభగా ప్రజలు అభివర్ణిస్తున్నారని, దేశానికి కరువు వస్తే తెలంగాణ నుంచి అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రాన్ని కేసీఆర్ తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఉద్యమాలకు పురిటిగడ్డయిన వరంగల్‌లో సభ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రేవంత్ పాలన సాగిస్తున్నారని, ఇంకా మూడున్నరేళ్ల కాంగ్రెస్‌ను ఎలా భరించాలంటూ ప్రజలు మనోవేదనకు గురవుతున్నారన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలు విసుగు చెంది తిరిగి కేసీఆర్ పాలనను బలంగా కోరుకుంటున్నారన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడంతో పాటు శ్రీశైలం నీటిని పక్క రాష్ట్రానికి తరలించి తెలంగాణను ఎడారిగా మార్చారని ఆరోపించారు. ఫలితంగా కేసీఆర్ పదేళ్ల కష్టం వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మోసగాళ్ల పాలనపై ప్రజల్లో విరక్తి : ఎర్రబెల్లి దయాకర్‌రావు

అధికారంలోకి రాగానే హామీలను నెరవేరుస్తామని చెప్పి అమలు చేయని మోసగాళ్ల పాలనపై ప్రజలు విరక్తి చెందారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. ఎల్కతుర్తిలో జరుగుతున్న బీఆర్ఎస్ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతిలో పెట్టామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. తిరిగి రాష్ట్రాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. 27న నిర్వహించే గులాబీ పండుగకు లక్షలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. రాష్ట్ర నాయకులు తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, నాగుర్ల వెంకన్న, చింతం సదానందం, మండల నాయకులు జడ్సన్, నగేష్, మహేందర్, స్వామి, శేషు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గవిచర్ల గ్రామంలో పర్యటిస్తున్న స్వర్ణ

రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ పౌరుడి బాధ్యత

కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ

సంగెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ పౌరుని బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చెప్పారు. సోమవారం మండలంలోని గవిచర్ల గ్రామంలో మండల పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను అమలు చేయడంలో ప్రముఖ పాత్రను పోషించాలని అన్నారు. ప్రతీ గ్రామంలోని ప్రతీ ఒక్కరు రాజ్యాంగానికి జరుగుతున్న ప్రమాదాలను వివరించాలన్నారు. అహింసా పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన నాటి పోరాట యోధులను గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు రమేష్, జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ, మండల మహిళ అధ్యక్షురాలు సంధ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అచ్చ నాగరాజు, నర్సింహనాయక్, పాష, జగన్నాథ చారి, బానిపాక సదయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి మాత విగ్రహం తయారీ పూర్తి

మహదేవపూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు మహా బలిపురంలో వీఐపీ ఘాట్ వద్ద నిర్మిస్తున్న సరస్వతి అమ్మవారికి విగ్రహం తయారీ పూర్తయ్యింది. దాదాపు నెలరోజుల కింద ఈ విగ్రహానికి ఆలయ అధికారులు బలిపురానికి వెళ్లి అమ్మవారి విగ్రహానికి ఆర్డర్ ఇచ్చారు. అయితే విగ్రహం తయారీ పూర్తయిందని దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ నెల 30న విగ్రహాన్ని కాళేశ్వరం తీసుకురానునట్టు తెలిసింది. వీఐపీ ఘాట్ వద్ద భక్తులు స్నానాలు ఆచరించి సరస్వతి విగ్రహాన్ని దర్శించుకుని కాళేశ్వరాలయానికి వెళ్తారు.

కొండపర్తిలో గవర్నర్ కార్యదర్శుల బృందం

అభివృద్ధి పనుల పరిశీలన

తాడ్వాయి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ దత్తత తీసుకున్న గ్రామం కొండపర్తిని ఆయన ప్రత్యేక కార్యదర్శులు భవాని శంకర్, పవన్ సింగ్, గోవిందదాస్ సోమవారం సందర్శించారు. అధికారులతో కలిసి అభివృద్ధి పనులు, బహుళ ఉపయోగ యంత్రాలను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహుళ ఉపయోగాల యంత్రాలు మసాల తయారీ యూనిట్, టైలరింగ్ సెంటర్‌ను సందర్శించారు. మహిళా సంఘం సభ్యులతో సమావేశమై ఆయా యూనిట్ల ఉపయోగాలు, సమస్యలు, అవసరాలు అడిగి తెలుసుకున్నారు. మసాల యూనిట్ అభివృద్ధి చేయడానికి వృత్తి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మధుకర్‌తో పలు అంశాలపై మాట్లాడారు. ఇంకా కావల్సిన అవసరాలు, మార్కెటింగ్ ఏర్పాట్లు, పనుల విధానం అడిగి తెలుసుకున్నారు. మిర్చి, పసుపు కొనుగోలు చేయడానికి, నిల్వా చేయడానికి మరింత అధిక వనరులు, సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో మసాలాలు గ్రైండింగ్ చేయడం, టైలరింగ్ శిక్షణ తరగతులు కొనసాగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఈఈ వీరభద్రం, వృత్తి సంస్థ విలేజ్ కోఆర్డినేటర్ సూదికొండ గణేష్, సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుళ ఉపయోగ యంత్రాలను పరిశీలిస్తున్న గవర్నర్ సెక్రటరీల బృందం

అధికారులు కళ్లు మూసుకున్నారా ?

- వేలాది ట్రిప్పుల మట్టి తరలింపుపై ఎందుకు సమాచారం లేదు
- కలెక్టర్, ఆర్డీవో, ఏడీ మైనింగ్ అధికారులపై ఫైర్
- సభ కోసం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రూ. 50 లక్షల డిమాండ్
- ఉద్యమం పేరుతో బీఆర్ఎస్ నాయకుల బెదిరింపులు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సభకు అక్రమంగా మట్టిని తరలిస్తుంటే కళ్లు మూసుకున్నారా ? అంటూ అధికారులపై వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ధ్వజమెత్తారు. సోమవారం ఎల్కతుర్తి మండల పరిధిలోని ఇందిరానగర్, సుర వైన్స్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కోసం వచ్చే వాహనాల పార్కింగ్ నిర్వహణలో భాగంగా పూడ్చిన దేవాదుల కాలువలను ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ సభకు ఎక్కడి నుంచి మట్టిని తరలించారు. ప్రభుత్వానికి ఎంత రాయల్టీ కట్టారని కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో రమేష్‌రాథోడ్, మైనింగ్ ఏడీలకు ఫోన్‌లో ఆరా తీశారు.

దీంతో తమ వద్ద ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, మట్టి తరలింపుపై తమకు సమాచారం లేదని అధికారులు బదులిచ్చారు. దీంతో మండిపడ్డ ఎమ్మెల్యే మట్టి తరలింపునకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు వెంటనే తెలియాలని డిమాండ్ చేశారు. తమ పరిధిలో జరుగుతున్న పనులపై సమాచారం లేకుండా ఎందుకు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. పెద్ద మొత్తంలో మట్టిని అక్రమంగా సభలకు తరలించడం, ప్రభుత్వ కాలువలు, వాగులను పూడ్చుతుంటే అధికారుల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. మట్టి తరలింపుపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వమన్నారు. రైతులకు నష్టం చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఉద్యమం పేరు చెప్పుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన పరిధిలో ఓ వ్యాపారిని సభ నిర్వహణకు రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించినట్లు ఆరోపించారు. దీనిపై ఫిర్యాదులు సైతం వచ్చాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ సంపదను ధ్వంసం చేశారన్నారు.

కాంగ్రెస్‌పై నిందలు మోపడం మానుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ సభను అడ్డుకోవాలనే ఆలోచన తమకు లేదన్నారు. సభకు అనుమతివ్వకుంటే కోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నామనడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యుడు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, నాయకులు సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, డాక్టర్ రమేష్, అంబాల శ్రీకాంత్, నవీన్, గొలిపెల్లి సంపత్, దుగ్యాల రాజేశ్వర్‌రావు, పెండ్యాల తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళా రైతు మృతి

- ఇది వడదెబ్బ మృతికాదు.. ప్రభుత్వ హత్యే
- ఆలస్యంగా కొనుగోళ్ల వల్లే మరణం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మృతి చెందిన ప్రేమలత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వడదెబ్బతో మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలత రెడ్డి (58) మృతి చెందిన సంఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెర్లపాలెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ప్రేమలతరెడ్డి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలోని ధాన్యం నాలుగు రోజుల కిందట ఆరబోశారు. గత రెండు రోజులు ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమె సోమవారం అక్క డిక్కడే మృతి చెందారు. మృతురాలికి భర్త వెంకట్రాంరెడ్డి, కుమారుడు మహిపాల్‌రెడ్డి ఉన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మృతదేహం వద్దకు చేరుకొని వెంకట్రాంరెడ్డిని ఓదార్చి, ప్రభుత్వ పరంగా మహిళా రైతును ఆదుకుంటామని భరోసానిచ్చారు.



ప్రేమలత మృతదేహం

ఇది ప్రభుత్వ హత్యే.. : ఎర్రబెల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడదెబ్బతో మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలత రెడ్డి (58) మృతి వడదెబ్బ మృతి కాదని, ఇది ప్రభుత్వ హత్యేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెంకట్రాంరెడ్డిని ఓదార్చి మాట్లా డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొనుగోలు కేంద్రా లు ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో మృతి చెందిన రైతు కుటుంబా నికి ప్రభుత్వం క్షమాపణ చెప్పి రూ.20లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆ ర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ప్ర ధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

17 కిలోమీటర్లు.. సవాలక్ష సమస్యలు

- కాళేశ్వరం - మహదేవపూర్ రహదారికి గ్రహణం
- మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పరిష్కారం కాని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పుష్కరాలకొచ్చే భక్తులకు తిప్పలు తప్పనట్టేనా?

మహదేవపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల ప్రారంభం కానున్న సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అయితే.. కొన్ని సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు మూలుగుతున్నాయి. మూడేళ్లుగా నిధులు మంజూరైనా వాటికి మోక్షం కలగడం లేదు. సరస్వతీ పుష్కరాల సందర్భంగానైనా అవి పూర్తవుతాయనుకుంటే ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం- మహదేవపూర్ జాతీయ రహదారి పనులు ఏమాత్రం ముందుకు సాగడం లేదు. దీని నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. లక్షా 66 కోట్ల 82 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇంతవరకు పనులు ముందుకు సాగడం లేదు. దీంతో సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేదు. గుంతలమయమైన రహదారితో వారు అవస్థలు పడక తప్పదని తెలుస్తోంది. జాతీయ రహదారిపై గుంతలకు ప్యాచ్‌లు వేస్తూ కాలం వెల్లదీస్తున్నారు తప్ప అసలు సమస్యను పరిష్కరించడం లేదు.



కాళేశ్వరం - మహదేవపూర్ జాతీయ రహదారి

మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వెళ్లే జాతీయ రహదారి 17 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఇది పూర్తి కావడానికి వంద అడ్డంకులు, సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు నిధులు, ప్లాన్ అన్ని ఉన్నా అసలు అనుమతులు రాకుండా పనులు ఆగిపోయాయి. మొదటి దఫా అటవీశాఖ అధికారుల నుంచి క్లియరెన్స్, నో అబ్జక్షన్ నోటీసులు రావాల్సి ఉంది.. ఒకటి వచ్చి మరొకటి రాకపోవడంతో ఆ పనులు అక్కడే ఉన్నాయి. 17కిలోమీటర్లలో 15 కిలోమీటర్ల వరకు అటవీశాఖ అనుమతుల కోసం ఆగగా.. మిగతా రెండు కిలోమీటర్లు రోడ్డు విస్తీర్ణానికి రైతుల వద్ద నుంచి భూ సేకరణ సమస్య ఉంది. ఇటు భూ సేకరణ కావడం లేదు.. అటు అటవీశాఖ అనుమతులు రావడం లేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి? ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కరించి సరస్వతీ పుష్కరాల వరకైనా రహదారి పనులు పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

కోతుల బెడదతో బేజార్

కాళేశ్వరం- మహదేవపూర్ జాతీయ రహదారిలో ప్రమాదకరంగా ఏడు మలుపులు ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మలుపుల వద్ద సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు అంటున్నారు. వీటికి తోడు ఈ 17 కిలోమీటర్ల వరకు ఎక్కడా లేనివిధంగా కోతుల బెడద ఎక్కువగా ఉంది. భక్తుల వాహనాలు అటు వైపు వెళ్తే చాలు.. కోతులు వాహనాల మీద దూకి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి.. ద్విచక్రవాహనాలకు ముప్పు తప్పడం లేదు. కాళేశ్వరం పుష్కరాలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కోతుల బెడద నుంచి కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన ఎంఆర్ఐ

- వారసత్వ భూమి పట్టా కోసం డబ్బులు డిమాండ్
- లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- జనగామ జిల్లా చిలుపూర్ మండలంలో ఘటన

చిలుపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వారసత్వంగా వచ్చిన భూమిని పట్టాచేయడం కోసం ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ చిలుపూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. జనగామ జిల్లా చిలుపూర్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన కలకలం సృష్టించింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆవుల బుచ్చయ్య 10 నెలల క్రితం చనిపోగా, అతని పేరిట 1.23 గుంటల భూమి ఉంది. ఈ భూమిని వారసత్వ పట్టా చేయడం కోసం అతని కుమారులు లింగయ్య, రాజయ్య పలుమార్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినీత్‌కుమార్‌ను సంప్రదించారు. భూమిని సర్వే, మ్యుటేషన్ చేయడం కోసం ఆర్ఐ వారిని డబ్బులు డిమాండ్ చేయగా దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న కారులో ఆర్ఐ రూ. 26 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడుల్లో సీఐలు సట్ల రాజు, ఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వినీత్‌కుమార్

పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



సువర్ణను సత్కరిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో రాణించే పోలీస్ క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. గత మార్చిలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 18వ జాతీయ పోలీస్ షూటింగ్ (స్పోర్ట్స్) చాంపియన్‌షిప్‌నకు తెలంగాణ తరుపున ప్రాతినిధ్యం వహించి 300మీటర్ల మహిళా జట్టు విభాగంలో సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్సై సువర్ణ సిల్వర్ మెడల్ సాధించింది. ఈ మేరకు మెడల్‌తో వచ్చి సీపీని సోమవారం కలవగా ఘనంగా సత్కరించి భవిష్యత్‌లో రాణించేందుకు సహకరిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

వాచ్‌మన్‌కు 20 ఏళ్ల జైలు

బాలికపై లైంగిక దాడి కేసులో శిక్ష ఖరారు

హసన్‌పర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 7వ తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్న హాస్టల్ వాచ్‌మన్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ అదనపు జిల్లా జడ్జి అపర్ణదేవి సోమవారం తీర్పు చెప్పారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం.. వడ్డెపల్లి చర్చి సమీపంలోని ఎస్‌డీ ఆశ్రమ పాఠశాలలో తల్లిని కోల్పోయి ఉన్న బాధిత బాలిక చదువుకునేది. అదే పాఠశాలలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం రవినగర్‌కు చెందిన నిందితుడు ఆకుల సాంబ బాలికతో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి అభం శుభం తెలియని బాలికను వేములవాడకు తీసుకెళ్లి అక్కడి సత్రంలో పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. మోసం గ్రహించిన బాలిక సీతంపేటలోని తన మేనమామకు విషయం తెలిపింది. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై 2019 అక్టోబర్ 6న ఫిర్యాదు చేశారు. అప్పటి కాజీపేట ఏసీపీ రవీంద్రనాయక్ పోక్సో కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యుల్ని విచారించిన న్యాయమూర్తి సాంబకు 20సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు. అఘాయిత్యానికి గురైన బాలిక భవిష్యత్ కోసం రూ.4లక్షల ఆర్థిక సాయాన్ని బాలికకు ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి వాదించగా కోర్టు డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ వలబోజు రవీందర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు.

వడ దెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

సంగెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గీసగోని శ్రీదేవి(36) ఎండ, వడ దెబ్బకు మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. శ్రీదేవి ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లింది. ఎండవేడిమికి తాళ లేక వాంతులు, విరేచనాలు కావడంతో తోటి మహిళలు వెంటనే శ్రీదేవిని ఇంటికి తీసుకవెళ్లారు. విరేచనాలు అవుతున్న మహిళను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదే రోజు రాత్రి మృతి చెందారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.



శ్రీదేవి



నేడు ధరిత్రి దినోత్సవం

- మేడారం అడవుల్లో టోర్నడో తరహా విధ్వంసం
- క్లౌడ్ బరస్ట్‌లు, భూప్రకంపనలతో భయంభయం
- 20శాతం తగ్గిన అడవుల విస్తీర్ణం
- 2మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

పర్యావరణంలో పెనుమార్పులు

పెరుగుతున్న భూతాపంతో ఎన్నో అనర్థాలు

హనుమకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సమస్త జీవకోటి భారాన్ని మోసే ధరిత్రి తల్లడిల్లుతోంది. పర్యావరణంలో వస్తున్న పెనుమార్పులతో ఎన్నో విధ్వంసాలకు ఆలవాలమవుతోంది. అటు పర్యావరణ పరిరక్షణ.. ఇటు జీవనశైలిలోనూ వస్తున్న మార్పులతో భూపరిరక్షణపై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఇందులో నుంచి వచ్చిందే ప్రపంచ ధరిత్రీ దినోత్సవం. 1970 నుంచి ప్రారంభమైన ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా 190 కంటే ఎక్కువ దేశాల్లో ఏప్రిల్ 22న జరుపుకొంటున్నాయి. భూగోళంపై మానవ ప్రభావాన్ని తెలియజేయడం, అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. 2025 ఏడాదికి సంబంధించి 'మన వనరులు, మన భూగోళం' నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత దశాబ్దకాలంలో పర్యావరణం పరంగా పెనుమార్పులు సంభవించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కుండపోత వర్షాలు (క్లౌడ్ బరస్ట్), వరదలు సంభవించడం, ఉమ్మడి జిల్లా చరిత్రలోనే మొదటి సారిగా ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతంలో టోర్నడో తరహా గాలులతో అడవిలో విధ్వంసం చెలరేగింది. అంతేకాదు ఇటీవల స్వల్పంగా భూమి కూడా కంపించడం.. దానికి మేడారం కేంద్రం కావడం ప్రత్యక్ష ఉదాహరణలు. మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని వాతావరణ పరిస్థితులు, చోటు చేసుకుంటున్న పరిణామాలు, అందుకుగల కారణాలు, ధరిత్రి పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో..:

భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు, నేల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతోంది. వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమవుతుందన్నది గుర్తించాలి. కానీ ప్రస్తుతం నానాటికీ పెరుగుతున్న భూతాపంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని జీవరాశి మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. ఈ పరిస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కనిపిస్తోంది. పదేళ్ల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వాతావరణంలో పెనుమార్పులొచ్చాయి. జనాభా పెరిగింది. పట్టణీకరణ ఊపందుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పల్లెలు కూడా కాంక్రీట్ జంగిళ్లుగా మారుతున్నాయి. ఫలితంగా పచ్చదనం కరువవుతోంది. అంతేకాదు రవాణా సౌకర్యాలు మెరుగుపడి రాకపోకలు పెరిగాయి. గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో వాహనాల సంఖ్య 35 శాతం పెరగ్గా.. ఆమేరకు కాలుష్యం కూడా రెట్టింపైంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు..

భూతాపం పెరగడం వల్ల ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత పదేళ్లలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 48 డిగ్రీలపైనే నమోదు అయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సాధారణ ఉష్ణోగ్రత 34.9 డిగ్రీ అయితే దానిని మించి రికార్డు స్థాయిలో 48.9 డిగ్రీలు నమోదయింది. మహబూబాబాద్ జిల్లాలో 48.5 డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 48.7 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో 47.6 డిగ్రీలు, ములుగు జిల్లాలో 48.5 డిగ్రీలు నమోదైంది.



గతేడాది భీకర గాలులకు తాడ్వాయి అడవుల్లో నేలకూలిన వృక్షాలు

తరగిపోతున్న అడవులు

అడవుల వల్ల విస్తృతంగా వర్షాలు కురిసి భూతాపం తగ్గుతుంది. పచ్చదనం వల్ల ఆ ప్రాంతమంతా చల్లగా ఉంటుంది. విస్తారమైన అడవులకు పేరున్న ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గత దశాబ్ద కాలంలో వాటి విస్తీర్ణం 20 శాతం మేరకు తగ్గిపోయినట్టు అంచనా. ప్రస్తుతం ములుగు జిల్లాలో 64.64 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 41.15 శాతం అడవి, మహబూబాబాద్ జిల్లాలో 26.49 శాతం మాత్రమే ఉంది. జనగామ జిల్లాలో 4.44 శాతం, వరంగల్ జిల్లాలో 3.53 శాతం, హనుమకొండ జిల్లాలో 3.40 శాతం మాత్రమే అటవీ ప్రాంతం ఉంది. విచక్షణా రహితంగా చెట్లను నరికి వేయడం వల్ల దాని ప్రభావం ధరిత్రిపై పడుతోంది.





పగబడుతున్న ప్రకృతి

ఉమ్మడి జిల్లాలో అయిదారు సంవత్సరాలుగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలను చూస్తుంటే ప్రకృతి పగబట్టిందా అన్న అనుమానం కలుగుతోంది. ఒకప్పుడు సాధారణ వర్షపాతం నమోదయ్యే ఉమ్మడి జిల్లాలో క్లౌడ్ బరస్ట్‌లు ఏర్పడి కుండపోత వర్షాలు పడుతున్నాయి. 2023 జులైలో కురిసిన భారీ వర్షాలతో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ఉమ్మడి జిల్లా చరిత్రలోనే తొలిసారిగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98 సెమీ, భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65, సెంమీల రికార్డు వర్షపాతం నమోదైంది. 2023జూలైలో వరంగల్ చరిత్రలో మొదటిసారి వాన బీభత్సంతో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగాయి. వరద ఉధృతికి తట్టుకోలేక చెరువులు, కుంటలు తెగిపోయాయి. గంటలకు 50 కిమీ వేగంతో గాలులు వీచాయి. ఇక గతేడాది మహబూబాబాద్ జిల్లాలో క్లౌడ్‌బరస్ట్ జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఇక గతేడాది ఆగస్టు31న ములుగు జిల్లా తాడ్వాయి-మేడారం అడవుల్లో టోర్నడో సంభించింది. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వీచిన ఆ సుడిగాలుల తీవ్రతకు మేడారం అడవుల్లో ఏడు కిలోమీటర్ల మేర అయిదు హెక్టార్ల పరిధిలో 50వేలకుపైగా చెట్లు నేలకూలాయి. ఇదిలా ఉంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూకంపాలు అరుదు. అలాంటిది గత సంవత్సరం డిసెంబరు 4న ఉదయం భూప్రకంపనలు సంభవించడం ప్రజలను తీవ్రభయాందోళనకు గురి చేసింది. ఉదయం 7.30గంటల సమయంలో భూమి కంపించగా.. అది మేడారం కేంద్రంగా వచ్చినట్టు రిక్టర్‌స్కేల్‌పై చూపడం మరింత ఆందోళన రేకెత్తించింది. ఇక 2023 ఆగస్టు 25న కూడా వరంగల్, హనుమకొండ, జనగామ ప్రాంతాల్లో స్వల్పంగా భూమి కంపించింది.

ధరణి రక్షణకు చర్యలు..

భూతాపం రోజు రోజుకు అంతకంతకు పెరుగుతుండడంతో పర్యావరణంలో పెనుమార్పులు సంభవించి ప్రకృతివైరీత్యాలు సంభవిస్తున్నాయి. దీని నివారణకు కొన్ని చర్యలు పాటిస్తే భూతాపం కొంత మేరకు తగ్గవచ్చు. కాలుష్య కారకాల నియంత్రిచడం, అడవులు, పచ్చదనం రక్షణ, కర్బన ఉద్గారాలు వెలువడే వాటిని నియంత్రించడం, పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించడం, వ్యర్థాల వినియోగం, పునర్వినియోగ ఇంధనాలు, వస్తువులను వినియోగించడం లాంటివి చేయాల్సి ఉంటుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలి.

నేడు ఇనుపరాతి గుట్టల్లో వాకింగ్

ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని భూమిని పరిరక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక సంయుక్త అద్వర్యంలో మంగళవారం దేవునూరిలోని ఇనుపరాతి గుట్టల్లో వాకింగ్‌ను నిర్వహిస్తున్నారు. అలాగు దేవునూరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ధరిత్రి పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు. ఉదయం 5.30 గంటల నుంచి గుట్టల్లో వాకింగ్‌ను చేపడతారు. పలువురు పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారు.

ప్రకృతికి దగ్గరగా జీవించాలి



ధరణి పరిరక్షణ, మానవాళి మనుగడకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి. ప్రస్తుతం ఏటా ప్రకృతి నుంచి 124 ట్రిలియన్ డాలర్ల విలువైన వనరులను వాడుతున్నాం. అవసరాలకు మించి 30 శాతం అధికంగా వినియోగిస్తున్నాం. ప్రకృతి వనరుల రీసైక్లింగ్ జరగడం లేదు. దీంతో వనరులు తరిగిపోతున్నాయి. గాలి, నీరు, నేల కలుషితమై పోతోంది. కాలుష్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా సాగుతోంది. పచ్చదనం తగ్గిపోతోంది. ఫలితంగా భూతాపం పెరిగిపోతోంది. ఇటీవల భూతాపం ఒకటిన్నర డిగ్రీలు పెరగడంతో అనేక జీవులు నశించి పోతున్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు పర్యావరణ హితంగా జీవించడం అలవరుచుకోవాలి.

- కాజీపేట పురుషోత్తం, రిటైర్డ్ జిల్లా అటవీ అధికారి అధ్యక్షుడు, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, జనవిజ్ఞానవేదిక, హనుమకొండ జిల్లా

కుంగిపోవద్దు.. కన్నీరు మిగల్చొద్దు..

మార్కులెలా వచ్చినా మనోధైర్యం చెడొద్దు

- ఫెయిలైనా ఆత్మస్థైర్యంతో ముందడుగేయాలి
- పరీక్షల ఫలితాల వేళ పిల్లలను తల్లిదండ్రులు ఓదార్చాలి



వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. మంగళవారం ఇంటర్ ఫలితాలు, ఆ తర్వాత మరో వారం రోజుల్లో పదో తరగతి ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలో పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని అలవాటు చేయాల్సి ఉంది. చిన్నచిన్న కారణాలతోనే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు పిల్లలు. అలాంటిది తాము ఎంతో కష్టపడి చదివిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైతే.. లేదంటే ఇతరుల కంటే మార్కులు తక్కువగా వస్తే.. కొందరు ఒక్కసారిగా ధైర్యం కోల్పోతారు. చిన్నతనంగా భావిస్తారు. అమ్మానాన్నలు తిడతారననో.. బంధువుల్లో చుట్టుపక్కల వారిలో తలెత్తుకుని తిరగలేమనో.. క్షణికావేశంలో తీసుకోరాని నిర్ణయం తీసుకుంటే.. అది ఆ కన్నవారి తీరని శోకమే మిగుల్చుతుంది. అందుకే పరీక్షల ఫలితాలు ఎలా ఉన్నా పిల్లలు కుంగిపోవద్దని, మార్కులు, ఫలితాలే పరమావధి కాదన్న విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పాలని మానసిక, మనో వికాస నిపుణులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువగా వచ్చినా పిల్లలను ఏమీ అనకుండా వారికి అండగా నిలవాలని.. అనుకున్న మార్కులు రాని వారికి ఇంప్రూవ్‌మెంట్, ఫెయిలైన వారికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయన్న ధైర్యం కల్పించాలని చెబుతున్నారు. అందుకే ముందుగానే పిల్లలను ఆ దిశగా సిద్ధం చేయాలని సూచిస్తున్నారు. అలాగే చుట్టుపక్కల వారు, బంధువులు కూడా పిల్లల మార్కులు, ఫలితాల గురించి బేరీజు వేయడం, హేళన చేయడం, ఒకరికొకరికి పోలికలు పెట్టడం లాంటివి చేయకుండా ఉండాలని చెబుతున్నారు. ఇక స్నేహితులు, తోటి విద్యార్థులు కూడా మార్కులు తక్కువవచ్చిన, ఫెయినలైన విద్యార్థులకు అండగా ఉండి ధైర్యం చెప్పాలని, లేదంటే వారికి తగినంత సాయం చేయాలని సూచిస్తున్నారు.

గతానికి ఇప్పటికీ ఎంతో మార్పు..

ఒకప్పుడు పదోతరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిపోతే ఏడాదంతా వృథా అయ్యేది. సెప్టెంబరులో సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసైతే వచ్చే ఏడాదికి ప్రమోట్ అయ్యేవారు. కానీ అలా విద్యాసంవత్సరం వృథా అవకుండా ఉండేందుకు ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఫలితాలు వచ్చిన నాటినుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందుకే ఫెయిలైనంత మాత్రాన పోయేదేం లేదని వెంటనే పరీక్షలు రాసి పాసవ్వచ్చన్న విషయాన్ని పిల్లలకు వివరించి ధైర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందులో ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని చెబుతున్నారు. ఓటమి నుంచి విజయాలు పొందిన గొప్ప వారి చరిత్రను పిల్లలకు చిన్నతనం నుంచే వివరిస్తూ ఉండాలని సూచిస్తున్నారు.



విద్యార్థులూ.. తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగల్చొద్దు

పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, ఫెయిల్ అయ్యామనే ఆత్మన్యూనతతో క్షణికావేశానికి గురికావొద్దు. ఫెయిల్ అయినా ధైర్యంతో ముందుడుగేయాలి. ఫలితాలు వెలువడిన కొద్ది రోజుల్లోనే నిర్వహిస్తున్న ఇన్‌స్టంట్ పరీక్షలపై దృష్టి పెట్టాలి. ఫలితాలు ప్రతికూలంగా వస్తే కుంగిపోయి అఘాయిత్యాలకు పాల్పడి తల్లిదండ్రులను దుఃఖాన్ని మిగల్చొద్దు. ఆత్మస్థైర్యంతో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేలా కృషి చేస్తే.. విజయాలు మీ చెంతకు అవే చేరుతాయనే విషయాన్ని గ్రహించాలి.

విద్యార్థులూ కుంగిపోవద్దు..



ఫలితాలను చూసి విద్యార్థులు కుంగిపోవద్దు. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువ వచ్చినా వాటిని విశ్లేషించుకోవాలి. అందుకు కారణాలు వెతుక్కొని వాటిని అధిగమించేలా ప్రయత్నాలు ప్రారంభించాలి. అంతే తప్ప ఫెయిల్ అయ్యామని ప్రాణాలు తీసుకోవద్దు. ప్రతీ విద్యార్థిలోనూ విజ్ఞానం దాగి ఉంటుంది. దానిని సరైన పద్ధతిలో బయటకు తీసుకురావాలి తప్ప ఒక్క సారి ఫెయిల్ అయితే జీవితమే అయిపోయిందనే భావనలో ఉండకూడదు. ప్రతీ ఓటమి విజయానికి అవకాశంగా మార్చుకొని ముందుకు సాగాలి.

- డాక్టర్ బరుపాటి గోపి, అధ్యాపకులు, మనోవికాస నిపుణులు...

ఒత్తిడిని జయించాలి..



ఫలితాల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు. ఒత్తిడికి గురైనా దాన్ని జయించాలి. సాధారణ పరిస్థితుల్లో లాగానే వ్యవహరించాలి. ఉత్తీర్ణత సాధించేందుకు ముందు నుంచే ప్రణాళిక బద్ధంగా చదవాలి. అప్పుడు ఫలితం ఎలా ఉండబోతుందో ముందే తెలిసిపోతుంది. అలాంటప్పుడు ఆత్మన్యూనతకు గురికావాల్సిన అవసరం రాదు. ఫెయిల్ అయితే మళ్లీ పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంది. కానీ ప్రాణాలు తీసుకుంటే తల్లిదండ్రులకు శోకమే మిగులుతుంది.

- పోగు అశోక్, ఉపాధ్యాయుడు, మోటివేషనల్ స్పీకర్

బీజేపీది గాడ్సే సిద్ధాంతం

- అదానీ, అంబానీలు రూ.21 లక్షల కోట్లను మాఫీ చేశారు
- రైతులకు రుణమాఫీ చేయడానికి చేతులు రాలేదు
- స్వేచ్ఛ, సమానత్వాల పరిరక్షణకు రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి
- ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపులో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీది గాడ్సే సిద్ధాంతమని ఆ మేరకే పాలన సాగిస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను రగల్చడమే అజెండాగా పెట్టుకొందని దుయ్యబట్టారు. హనుమకొండ హరితా హోటల్‌లో జరుగుతున్న 'ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ మూడవ రోజు సోమవారం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన సమ్మేళన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో శాంతియుత పరిస్థితులకు విఘాతం ఏర్పడిందన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ భయానక పాలన సాగిస్తోందని విమర్శించారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు, రైతులకు రుణమాఫీ చేయడానికి బీజేపీకి చేతులు రాలేదన్నారు. అంబానీ, అదానీ వంటి బడాబాబులకు మాత్రం రూ.21 లక్షల కోట్లను మోదీ ప్రభుత్వం మాఫీ చేసిందని విమర్శించారు.

బాపు, అంబేడ్కర్ ఆలోచనల సమ్మేళనమే కాంగ్రెస్ :

జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఆలోచనల సమ్మేళనమే కాంగ్రెస్ అని సీతక్క పేర్కొన్నారు. బీజేపీ అగ్రవర్ణాలు, పెత్తందార్లకు కొమ్ము కాస్తుంటే..తమ అధినేత రాహుల్ గాంధీ నిరుపేదల సంక్షేమం, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని హరించేందుకు బీజేపీ యత్నిస్తుంటే పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు. అణగారిన వర్గాలను అందలం ఎక్కించ డమే రాహుల్ గాంధీ లక్ష్యాల్లో ఒకటన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. సమ్మేళన్ శిక్షణ కార్య క్రమంలో వివిధ అంశాలపై కలిగిన అవగా హనను గ్రామలలో విస్తరించాలని సూచించారు.

తెలంగాణలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను డంప్ చేశారు.

30 వేల మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను బీజేపీ తెలంగాణలో డంప్ చేసిందని సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు వెల్లడించారు. బీజేపీ కుట్రలను చేధించడానికి గ్రామ స్థాయి నుంచి వాస్తవాలను వివరించే పనిలో ఆదివాసీలు నిమగ్నం కావాలని సూచించారు. ఆదివాసీలను చైతన్య పరిచి నాయకత్వాన్ని ఉత్పత్తి చేసే లక్ష్యంతో సమ్మేళన్ చేపట్టడం జరిగిందన్నారు. తెలంగాణ నుంచే సమ్మేళన్ శిక్షణ తరగతులు చేపట్టడానికి ఈ ప్రాంతానికి ఉన్న పోరాట చరిత్రే కారణమన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం గొప్ప ఘట్టమన్నారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అదే విధంగా జూన్ 2 నుంచి ఆగస్టు 15 వరకు రెవెన్యూ సదస్సులు జరుగనున్న క్రమంలో ఆదివాసీలు సిద్ధం కావాలన్నారు. భూభారతి చట్టంపై సంపూర్ణ అవగాహన ఏర్పర్చుకొని సదస్సుల్లో భూ సమస్యలు ఎదుర్కొంటున్న ఆదివాసీలకు పరిష్కార చర్యల్లో సహాయ, సహకారాలు అందించాలన్నారు. బీఆర్‌యస్ ఓటమికి ధరణీ లోపాలే ప్రధాన కారణమని కొప్పుల రాజు వెల్లడించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ ముగింపులో శిక్షణలో పాల్గొన వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శిక్షణ సర్టిఫికెట్లను అందచేశారు. సమ్మేళన్ ప్రారంభానికి ముందు హరితా హోటల్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు 'జై బాపు-జై భీమ్-జై సంవిధాన్-జై జగత్' ర్యాలీలో మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కావ్య తదితరులు పాల్గొన్నారు. మైదానంలో శ్రమదానం చేసి శుభ్రం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు విక్రంత్ బునియా, ఉపాధ్యక్షుడు బెల్లయ్యానాయక్, ఎంపీ బలరాంనాయక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, సమ్మేళన్ ఇన్‌చార్జి రాహుల్ బాల్, కో-ఆర్డినేటర్ చంద్రకళ, ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి బంగారు కానుక

రూ. 4 లక్షల విలువైన తాళిబొట్టు అందజేసిన భక్తుడు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళి అమ్మవారికి ఓ భక్తుడు బంగారు కానుక అందించారు. హనుమకొండకు చెందిన మాధవ్ అనే వ్యక్తి ఓవైపు ప్రభుత్వం ఉద్యోగం చేస్తూనే మరో వైపు గ్రూప్ -1 పరీక్ష రాశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు వచ్చినందున ఆనందంతో అమ్మవారికి రూ.4 లక్షల విలువ చేసే బంగారు తాళి బొట్టును తయారు చేయించి సోమవారం ఈవో శేష భారతి చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు.

మండే ఎండలో.. ఏమి హాయిలే ఇలా..



ఎవరూ లేరు ఈ నీళ్లలో దిగుదాం..



అహా చల్లగా ఉంది..



అబ్బా ఎవరో వస్తున్నారే..



హమ్మయ్య ఎంత హాయిగా ఉందో..

ఎండలు దంచి కొడుతుండటంతో మనుషులే కాదు పశుపక్షాదులు కూడా అల్లాడుతున్నాయి. అందుకు నిదర్శనమే ఈ చిత్రాలు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ఓ కోతి ఎంచక్కా నీటి తొట్టిలోకి దిగి జలకాలాడింది. హమ్మయ్య చల్లగా ఉందంటూ బయటకొచ్చి కేరింతలు కొట్టింది. ఈ దృశ్యాలు వాజేడు మండల కేంద్రంలోని ఓ ఇంట్లో సోమవారం కనిపించాయి.

- వాజేడు, ఆంధ్రజ్యోతి

దరఖాస్తుల వెల్లువ



రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో 16,986 అర్జీలు.. పరిశీలిస్తున్న అధికారులు

ములుగు రూరల్, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి ములుగు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ములుగు, ఏటూరునాగారం గోవిందరావుపేట, కన్నాయిగూడెం, మల్లంపల్లి, వెంకటాపూర్, తాడ్వాయి, వెంకటాపురం, వాజేడు, మంగపేట మండలాల్లో మొత్తం 16,986 అర్జీలు దాఖలైనట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత నెల 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా ఈనెల 14న గడువు ముగిసింది. ఆన్‌లైన్ ద్వారానే కాకుండా ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించారు. వాటిని ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో పరిశీలిస్తున్నారు. అయితే... ప్రభుత్వం అన్ని కార్పొరేషన్లకు ఒకేసారి దరఖాస్తులు కోరడంతో చాలా మంది ధ్రువీకరణ పత్రాలు లేక రాజీవ్ యువ వికాసం కోసందరఖాస్తు చేసుకోలేదని తెలుస్తోంది.

మండలాల వారీగా దాఖలైన దరఖాస్తులు ఇలా..

- ఏటూరునాగారం మండలంలో కార్పొరేషన్ వారీగా ఎస్సీ కార్పొరేషన్ కింద 476, ఎస్టీ 415, మైనారిటీ 114, క్రిస్టియన్ మైనారిటీ 0, బీసీ 178, ఈబీసీ 10, ఎంబీసీ 23, వాషర్‌మెన్ 35, నాయీ బ్రాహ్మణ 11, వడ్డెర 0, ఉప్పెర 0, కృష్ణ బలిజ 22, వాల్మీకి బోయ 0, కుమ్మరి 22, విశ్వబ్రాహ్మణ 34, మేదర 3, టోడ్డి టాపర్స్ 70, గంగపుత్ర 55, పెరిక 28, పద్మశాలి 104, మేర 1, ముదిరాజ్ 53, ముదిరాజ్‌కాపు 25, యాదవ కురుమ 47.. ఇలా మొత్తం 1726 దరఖాస్తులు వచ్చాయి.
- గోవిందరావుపేట మండలంలో ఎస్సీ కార్పొరేషన్ 341, ఎస్టీ 541, మైనారిటీ 65, క్రిస్టియన్ 2, బీసీ 220, ఈబీసీ 99, ఎంబీసీ 43, వాషర్‌మెన్ 53, నాయీ బ్రాహ్మణ 35, వడ్డెర 0, ఉప్పెర 0, కృష్ణ బలిజ 8, వాల్మీకి బోయ 0, కుమ్మరి 31, విశ్వబ్రాహ్మణ 51, మేదర 6, టోడ్డి టాపర్ 55, గంగపుత్ర 6, పెరిక 15, పద్మశాలి 56, మేర 3, ముదిరాజ్ 44, ముదిరాజ్ కాపు 79, యాదవ కురుమ 117.. మొత్తం 1870 దరఖాస్తులు వచ్చాయి.
- కన్నాయిగూడెం మండలంలో ఎస్సీ కార్పొరేషన్270, ఎస్టీ 247, మైనారిటీ 26, క్రిస్టియన్ మైనారిటీ 0, బీసీ 109, ఈబీసీ 3, ఎంబీసీ 11, వాషర్‌మెన్ 10, నాయీ బ్రాహ్మణ 5, వడ్డెర 0, ఉప్పెర 0, కృష్ణ బలిజ , వాల్మీకి బోయ 0, కుమ్మరి 6, విశ్వబ్రాహ్మణ 21, మేదర 14, టోడ్డి టాపర్స్ 42, గంగపుత్ర 13, పెరిక 28, పద్మశాలి 13, మేర 0, ముదిరాజ్ 0, ముదిరాజ్ కాపు 23, యాదవ కురుమ 7.. మొత్తం 842 దరఖాస్తులు వచ్చాయి.
- మల్లంపల్లి మండలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద 92, ఎస్టీ 126, మైనారిటీ 13, క్రిస్టియన్ మైనారిటీ 0, బీసీ 32, ఈబీసీ 5, ఎంబీసీ 4, వాషర్‌మెన్ 13, నాయీ బ్రాహ్మణ 8, వడ్డెర 0, ఉప్పెర 0, కృష్ణ బలిజ 2, వాల్మీకి బోయ 3, కుమ్మరి 9, విశ్వబ్రాహ్మణ 14, మేదర 0, టోడ్డి టాపర్స్ 9, గంగపుత్ర 0, పెరిక 1, పద్మశాలి 19, మేర 1, ముదిరాజ్ 45, ముదిరాజ్ కాపు 36, యాదవ కురుమ 41.. మొత్తం 473 దరఖాస్తులు దాఖలయ్యాయి.
- మంగపేట మండలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద 545, ఎస్టీ 563, మైనారిటీ 102, క్రిస్టియన్ మైనారిటీ 1, బీసీ 189, ఈబీసీ 50, ఎంబీసీ 51, వాషర్‌మెన్ 83, నాయీ బ్రాహ్మణ 25, వడ్డెర 1, ఉప్పెర 13, కృష్ణ బలిజ 16, వాల్మీకి బోయ 9, కుమ్మరి 29, విశ్వబ్రాహ్మణ 64, మేదర 0, టోడ్డి టాపర్స్ 117, గంగపుత్ర 121, పెరిక 55, పద్మశాలి70, మేర 4, ముదిరాజ్ 30, ముదిరాజ్ కాపు 63, యాదవ కురుమ 90.. మొత్తం 2,291 దరఖాస్తులు వచ్చాయి.
- ములుగు మండలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద 628 ఎస్టీ 863, మైనారిటీ 161, క్రిస్టియన్ మైనారిటీ 1, బీసీ 535, ఈబీసీ 49, ఎంబీసీ 77, వాషర్‌మెన్ 133, నాయీ బ్రాహ్మణ 52, వడ్డెర 0, ఉప్పెర 11, కృష్ణ బలిజ 4, వాల్మీకి బోయ 8, కుమ్మరి 72, విశ్వబ్రాహ్మణ 100, మేదర 6, టోడ్డి టాపర్స్ 113, గంగపుత్ర 3, పెరిక 62, పద్మశాలి 79, మేర 21, ముదిరాజ్ 163, ముదిరాజ్ కాపు 109 యాదవ కురుమ 146.. మొత్తం 3,396 దరఖాస్తులు వచ్చాయి.
- తాడ్వాయి మండలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద 166 ఎస్టీ 504, మైనారిటీ 19, క్రిస్టియన్ మైనారిటీ 1, బీసీ 115, ఈబీసీ 18, ఎంబీసీ 15, వాషర్‌మెన్ 28, నాయీ బ్రాహ్మణ 8, వడ్డెర 0, ఉప్పెర 0, కృష్ణ బలిజ 11, వాల్మీకి బోయ 0, కుమ్మరి 9, విశ్వబ్రాహ్మణ 27, మేదర 3, టోడ్డి టాపర్స్ 61, గంగపుత్ర 5, పెరిక 16, పద్మశాలి 25, మేర 3, ముదిరాజ్ 37, ముదిరాజ్ కాపు 18, యాదవ కురుమ 27.. మొత్తం 1,116 దరఖాస్తులు వచ్చాయి.
- వెంకటాపూర్ మండలంలో కార్పొరేషన్ వారిగా ఎస్సీ కార్పొరేషన్ కింద 434 ఎస్టీ 249, మైనార్టీ 52, క్రిస్టియన్ మేనార్టి 1, బీసీ 369, ఈబీసీ 52, ఎంబీసీ 13, వాషర్‌మెన్ 89, నాయీ బ్రాహ్మణ 17, వడ్డెర 3, ఉప్పెర 1, కృష్ణ బలిజ 2, వాల్మీకి బోయ 3, కుమ్మరి 26, విశ్వబ్రాహ్మణ 79, మేదర 7, టోడ్డి టాపర్స్ 130, గంగపుత్ర 4, పెరిక 13, పద్మశాలి 57, మేర 13, ముదిరాజ్ 147, ముదిరాజ్ కాపు 120 యాదవ కురుమ 125 మెత్తం 2006 దరఖాస్తులు వచ్చాయి.
- వెంకటాపురం మండలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద 429, ఎస్టీ 520, మైనారిటీ 21, క్రిస్టియన్ మైనారిటీ 1, బీసీ 161, ఈబీసీ 23, ఎంబీసీ 33, వాషర్‌మెన్ 38, నాయీ బ్రాహ్మణ 15, వడ్డెర 0, ఉప్పెర 0, కృష్ణ బలిజ 0, వాల్మీకి బోయ 0, కుమ్మరి 5, విశ్వబ్రాహ్మణ 26, మేదర 0, టోడ్డి టాపర్స్ 28, గంగపుత్ర 247, పెరిక 13, పద్మశాలి 16, మేర 0, ముదిరాజ్ 13, ముదిరాజ్ కాపు 42 యాదవ కురుమ 40.. మొత్తం 1,671 దరఖాస్తులు వచ్చాయి.
- వాజేడు మండలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద 359, ఎస్టీ 670, మైనారిటీ 24, క్రిస్టియన్ మైనారిటీ 0, బీసీ 121, ఈబీసీ 5, ఎంబీసీ 22, వాషర్‌మెన్ 25, నాయీ బ్రాహ్మణ 20, వడ్డెర 4, ఉప్పెర 0, కృష్ణ బలిజ 14, వాల్మీకి బోయ 0, కుమ్మరి 17, విశ్వబ్రాహ్మణ 41, మేదర 0, టోడ్డి టాపర్స్ 10, గంగపుత్ర 185, పెరిక 18, పద్మశాలి 14, మేర 0, ముదిరాజ్ 9, ముదిరాజ్ కాపు 17 యాదవ కురుమ 20.. మొత్తం 1,595 దరఖాస్తులు దాఖలయ్యాయి.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



లక్ష్మీపురంతండాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారెంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. మండలంలోని దూత్‌పల్లి, లక్ష్మీపురంతండా, ఒడితల, కొత్తపేట, గోపాలపురం, జడల్‌పేట, నైన్‌పాక, చైన్‌పాక, అందుకుతండా, వెంచరామి, గిద్దెముత్తారం, కాల్వపల్లి గామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాయ మాటలతో కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు.ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకుల, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, ప్రధాన కార్యదర్శులు మడికొండ రవీందర్, రాజేందర్, యూత్ మండల అధ్యక్షుడు తౌటం నవీన్, ఆయా గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నిర్భయంగా పోసులను ఆశ్రయించండి

ప్రజాదివస్‌లో ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలెవరైనా ఏదైనా సమస్య ఎదురైతే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దివస్ కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజాదివస్‌లో మొత్తం 18 మంది ఫిర్యాదులు అందించి, తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధి కారులతో ఫోన్‌లో మాట్లాడుతూ పలు ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి ఠాణాకు వచ్చే బాధితులకు ధైర్యాన్నివ్వాలన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ఉపాధ్యాయ సంఘాల నేతలు

కాటారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసేవారికి విశేష గుర్తింపు లభిస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముస్కుల రఘుశంకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి అన్నారు. ధన్వాడ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బల్గూరి శ్రీదేవి, సుందరాజ్‌పేట స్కూల్ అసిస్టెంట్ పోరెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి రమణారెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభలు సోమవారం వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. పలు మండలాల ఎంఈవోలు శ్రీదేవి, సంజీవరెడ్డి, లక్ష్మణ్ బాబు, రాంధన్, పీఆర్‌టీయూ మండల బాధ్యులు రవీందర్, తిరుపతి, సురేష్‌రావు, ఉపాధ్యాయ సంఘాల జిల్లా నేతలు గడ్డం లక్ష్మయ్య, కరుణాకర్‌రావు, టీచర్లు శ్రీనివాసరెడ్డి, రాజబాపు, వెంకటేశ్వర్లు, శరత్‌బాబు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' కెనాల్స్ భూసేకరణ సర్వే

కాటారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఒడిపిలవంచ, వీరాపూర్ పరిధిలో కెనాల్స్ నిర్మాణం కోసం భూసేకరణపై సోమవారం అధికారులు సర్వే నిర్వహించారు. ఆదివారంపేట డెలివరీ సిస్టర్న్‌లో భాగంగా మెయిన్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న సర్వేలో సుమారు 150 ఎకరాలు భూసేకరణ జరగనుందని పేర్కొన్నారు. .

రిజర్వాయర్ మత్తడి పనుల అడ్డగింత

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో చేపట్టిన గారెపల్లి నూతన రిజర్వాయర్ మత్తడి నిర్మాణ పనులనుదంతెలపలికి చెందిన పలు వురు భూ నిర్వా సితులు సోమవారం అడ్డుకున్నారు. తమకు పరిహారం ఇచ్చే వరకు పను లు చేయొద్దని అభ్యంతరం తెలిపారు. రిజర్వాయర్ కోసం 15 ఏళ్ల క్రితం భూములను తీసుకోగా కొందరికి పరిహారం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

గణపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించేబీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు వేణుగోపాల స్వామి కల్యాణం

రేగొండ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు శాశ్వత ధర్మకర్త, ప్రధాన అర్చకుడు సురేష్ ఆచార్యులు, ఆలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతి ఏటా శ్రవణ నక్షత్ర యుక్త మిథున లగ్నంలో వేణుగోపాలస్వామి కల్యాణం ఘనంగా జరుపుతారు.

ఆదర్శప్రాయుడు అంబేద్కర్

ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆదర్శప్రాయుడని, ఆయన ఆలోచనలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో విశ్రాంత డీడబ్ల్యూవో చెన్నయ్య నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం చేకూరుతోందన్నారు. మహనీయుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేయడం కాంగ్రెస్ నిబద్ధతతకు నిదర్శన మన్నారు. రాజ్యాంగాన్ని ఆచరించాల్సిన కొంత మంది పాలకులు ఆయన్ను విమర్శిస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, రాయకొంరు, టౌన్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు గంగాధరి రవీందర్, దబ్బెట అనిల్, సర్వ శరత్, అల్లం రాజు, వేణు, ఏవైఎస్ మండల అధ్యక్షుడు జన్నె యుగందర్ తదితరులు పాల్గొన్నారు



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

బ్రిడ్జి నిర్మాణ పనుల ఎమ్మెల్యే పరిశీలన

గణపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరంచవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించి త్వరతగతిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ అధికారులు, కాంగ్రెస్ నాయకుల పాల్గొన్నారు.

యాదవులకు సంక్షేమ ఫలాలు అందాలి

మంగపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాదవులకు సంక్షేమ ఫలాలు అందించాలని యాదవ హక్కుల పోరాట సమితి (వైహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షుడు కుంట రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని కమలాపురంలో సంఘం సీనియర్ నాయకుడు నిమ్మల రాంబాబు యాదవ్ మాతృమూర్తి నిమ్మల గంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. అనంతరం సంఘం సమావేశం సంఘం సీనియర్ నాయకుడు పులిగిల్ల శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరగ్గా రవీందర్ యాదవ్ మాట్లాడారు. యాదవ కులస్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ఓట్లు వేసు కొని గద్దెలను ఎక్కారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలను జనాభా నిష్పత్తి ప్రకారం యాదవులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.స్వామి యాదవ్, ఏటూరునాగారం సహకార సంఘం డైరెక్టర్ వంగపండ్ల రవియాదవ్, ఏటూరునాగారం మాజీ ఎంపీపీ అంతటి నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే భూ సమస్యల పరిష్కారం

కలెక్టర్ దివాకర టీఎస్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్, ఏప్రిల్ 21, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన భూ భారతి పోర్టల్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, చట్టప్రకారమే సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ దివాకర అన్నారు. మల్లంపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ధరణిలో పరిష్కారం కాని సమస్యలను భూభారతి చట్టం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. గతంలో ఉన్న చట్టానికి అనుగుణంగా మరో 14 నూతన అంశాలను ప్రభుత్వం పొందుపరిచిందన్నారు. భూభారతి చట్టం ద్వారా పట్టాలను పొందొచ్చన్నారు. సదస్సులో ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ భాస్కర్ తదిరులు పాల్గొన్నారు.

సాయి ప్రకాశ్ అదృశ్యంపై ఏఎస్పీకి ఫిర్యాదు

ఏటూరునాగారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన చేయూత, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ ఆచూకీ తెలియరాలేదు. వారం రోజుల క్రితం వెంకటాపురంలోని తన ఇంటి నుంచి కారులో హనుమకొండకు వెళ్లి అక్కడే అదృశ్య మయ్యారు. దీంతో సోమవారం ఏటూరు నాగారం బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్ ఈ విషయాన్ని తెలియజేస్తూ సాయి ప్రకాశ్ క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని కోరారు. ఈ మేరకు సాయి ప్రకాష్ అదృశ్యంపై వహీద్ ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఇంతవరకు ఎలాంటి సమాచారం లభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇద్దరిపై కోతులదాడి.. తీవ్ర గాయాలు

మంగపేట, ఏప్రీల్ 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురంలో కోతులు నానా బీభత్సం సృష్టిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. అడ్డొచ్చిన వారిపై దాడిచేసి తీవ్రంగా గాయపరు స్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులపై రెచ్చిపోతున్నాయి. సీపీ.నగర్‌కాలనీకి చెందిన భట్టు సరోజన, గాజ కోమలను కోతులు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ సంఘటనలు వేర్వేరుగా జరిగాయి. చుట్టు పక్కల వాళ్లు గ్రహించి కోతులను కర్రలతో తరిమేశారు. గాయపడిన ఇద్దరిని కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామంలో కోతల స్వైర విహారం ఎక్కువైందని, వాటిని నియంత్రించాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఘనంగా సన్మానం

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవం పురస్కరించుకొని కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మాయంక్ సింగ్‌ను జిల్లా అధికార యం త్రాంగం సన్మానించింది. కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్, సబ్ కలెక్టర్‌ను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా అధికారులు పుష్ప గుచ్ఛం, శాలువతో సత్కరించారు. ఈకార్యక్ర మంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల నిరసన

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ బిల్లులు అందించాలని కోరుతూ గోవిందరావుపేట మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన లబ్ధిదారులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 34 ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు. అయితే విడతలవారీగా నిధులు మంజూరు చేయాల్సిన ఐటీడీఏ అధికారులు తమను పట్టించుకోకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికీ పూర్తికాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ అధికారి తనిఖీలు

గోవిందరావుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా గ్రామంలోని హోటళ్లు, గ్యాస్ రీఫిల్లింగ్ షాపులు, చికెన్ సెంటర్లు, కిరాణషాపులు, టీస్టాళ్లను సోమవారం సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ఫైసల్ హుస్సేన్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, చికెన్ సెంటర్ల నిర్వాహకులు కమర్షియల్ సిలిండర్లు వాడాలని సూచించారు. అనంతరం డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న ఆయా షాపుల యజమానులపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా గోవిందరావుపేట మండలకేంద్రంలో, మరో రెండు గ్రామాల్లోని కిరాణాషాపుల్లో అక్రమంగా నిల్వ ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

గౌడ కులస్థులపై దౌర్జన్యాన్ని ఖండించాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్థులపై జరిగిన దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మునినపల్లి మొండయ్య గౌడ్ పేర్కొన్నారు. ములుగు మండలంలోని జంగాలపల్లిక్రాస్‌లో గల బంజరుపల్లి తాటివనంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మొండయ్యగౌడ్ మాట్లాడుతూ తాళ్ల రాంపూర్‌లో గీత కార్మిక కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేసి, శ్రీరామనవమి రోజు దేవాలయంలోకి వచ్చిన గౌడ మహిళలను గెంటివేసి అవమానపరచడం దారుణమని అన్నారు. ఉపాధి కల్పించే ఈతచెట్లను తగులబెట్టిన విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, దేశిని రమేష్, కృష్ణ, జనగాం శ్రీను, దూలం శ్రీనివాస్, చిన్నా, బుర్ర రవి, రాగుల ప్రణయ్, మునిగాల రవి, వేముల వేణు, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 21 : వివిధ సమస్యలపై ప్రజలు సమర్పిస్తున్న వినతులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 39 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.సంపత్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్‌గా సతీష్

వెంకటాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్‌గా పర్శిక సతీష్ ఎంపికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం జరగగా రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీను ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన సమక్షంలో జిల్లా కన్వీనర్‌గా సతీష్, కోకన్వీనర్లుగా టింగ బుచ్చయ్య, పాయం భారతి, కుర్సం శివశంకర్, తాటి రామచంద్రు ఎన్నికయ్యారు.

రామాలయంలో పదహారవ రోజు పండుగ



ఆలయంలో మూలవిరాట్టు

మంగపేట, ఏప్రీల్ 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బోరునర్సాపురంలో వెలిసియున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి పూర్తయి 16 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం వేడుకలు నిర్వ హించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అర్చనలు, అభీషే కాలను అర్చకుడు జిడికంటి మధుసూ దనాచార్యులు నిర్వహించారు. మూల విగ్రహాలను నూతన వస్త్రాలు, పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ ప్రముఖులు భక్తులు హజరై కార్యక్రమాలను తిలకించారు. భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, మంగపేట సహకార సంఘం డైరెక్టర్ నర్ర శ్రీధర్ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి

వెంకటాపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరభద్రవరం, అంకన్నగూడెం గ్రామాల్లోని ప్రభుత్వభూమిని కొంతమంది గిరిజనేతరులు అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని, వాటిని రద్దు చేయాలని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు తాటి లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత ్వభూమిని సర్వే చేయాలని, అక్రమంగా పట్టాలు చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పూనెం నాగరాజు, తాటి శ్రీనాథ్, కోరం ప్రసాద్, పూనెం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పశువులు పరలిస్తున్న వాహనం పట్టివేత

ఏటూరునాగారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు మండలంలోని రొయ్యూరు క్రాస్ వద్ద సోమవారం పట్టుకున్నారు. ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం తెల్లవారుజామున మండల పరిధిలోని రొయ్యూరు క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా, అదే సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు గుర్తించారు. వాహనాన్ని తనిఖీ చేయగా పరిమితికి మించి 27 పశులను కుక్కి ఉన్నాయి. కాళ్లు, చేతులు విరిచి, మేత, నీరు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకుండా హింసిస్తూ కబేళాలకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా పశువులకు వెంటనే వెటర్నరీ వైద్యుల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వాటిని భూపాలపల్లి జిల్లాలోని రాంపూర్ గోశాలకు తరలించారు. ఈ వాహనం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా పట్టుకున్నామని సీఐ తెలిపారు. పట్టుబడిన వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చర్ల ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించి లాభాలు గడిస్తున్నట్లు చెప్పాడని పేర్కొన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని, దీనిపై విచారణ చేస్తున్నామని వెల్లడించారు. సీఐ వెంట ఎస్సై తాజుద్దీన్, సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.